క్లుప్తంగా

బ్రాండిక్స్‌లో నేత్ర వైద్య శిబిరం



నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

అచ్యుతాపురం(మునగపాక): బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 360 మందికి పరీక్షలు చేశారు. వీరిలో 38 మందికి కేటరాక్ట్ సర్జరీ చేయించుకోవాలని వైద్యులు సూచించారు. ఈ సందర్భంగా బ్రాండిక్స్ ఇండియా పార్టనర్ దొరైస్వామి మాట్లాడుతూ బ్రాండెక్స్ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా నేత్ర పరీక్షలు నిర్వహించి, మందులు అందజేస్తున్నామన్నారు.

అశ్లీల ప్రదర్శనలు తగదు



డీజే నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎస్ఐ ప్రసాదరావు

మునగపాక: వినాయక చవితి వేడుకల్లో భాగంగా అశ్లీల ప్రదర్శనలు నిర్వహించకుండా సహకరించాలని ఎస్ఐ పి.ప్రసాదరావు కోరారు. మునగపాక పోలీసు స్టేషన్‌లో శనివారం డీజే నిర్వాహకులతో ఆయన సమావేశం నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా గ్రామాల్లో ఎక్కడైనా అశ్లీల నృత్యాలు నిర్వహిస్తే డీజే నిర్వాహకులు తమకు సమాచారం అందించాలన్నారు. డీజే నిర్వాహకులు కూడా అశ్లీల నృత్యాలను ప్రోత్సహించడం తగదన్నారు.

చెరువులో తూటికాడ తొలగింపు



మునగపాక సంతబయిల చెరువులో జేసీబీతో తొలగిస్తున్న తూటికాడ

మునగపాక: స్థానిక సంతబయిల ములబంద గోడి ప్రాంతంలోని చెరువులో తూటికాడ తొలగింపు పనులు ఆదివారం చేపట్టారు. ఎగువ నుంచి వచ్చే నీరు కిందకు పోయే మార్గానికి అడ్డంకిగా నిలిచిన ఈ తూటికాడను రెవెన్యూ అధికారులు దగ్గరుండి జేసీబీతో తొలగించారు. చెరువులో తూటికాడ పెరిగిపోవడంతో ముంపు సమస్య రాకుండా వీఆర్వో హిమబిందు, కూటమి నాయకులు చర్యలు చేపట్టారు. వర్షాలు మరింత విస్తారంగా పడే అవకాశం ఉందని, మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్‌కుమార్ సూచించారు.

వరద బాధితులకు వస్త్రాలు, సరకుల సరఫరా

అనకాపల్లి: స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు పట్టణ ప్రజల సహకారంతో సుమారుగా 1500 చీరలు, తువ్వాలు, నైటీలు, లుంగీలు, దుప్పట్లు, 500 నిత్యావసర సరకుల కిట్లను ఆదివారం వ్యాన్‌ద్వారా విజయవాడకు పంపించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు సరిపల్లి రాజేష్ మాట్లాడుతూ వరద బాధితుల సహాయార్థం సుమారుగా రూ.6 లక్షల విలువైన వస్త్రాలు, సరకులు పంపించినట్టు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ప్రోగ్రాం చైర్మన్ బుద్ధ రమణాజీ, సభ్యులు కడిమిశెట్టి సతీష్, రాజేష్‌నాయుడు, కె.ఎల్.ఎన్.కుమార్, సోమసుందర్, పి.చందు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు 10న రాస్తారోకో

అనకాపల్లి : విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఈనెల 10న కూర్మనపాలెంలో రాస్తారోకో నిర్వహిస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించేందుకు మోదీ ప్రభుత్వం చర్యలు చేపడుతుందని, 1300 రోజులుగా కార్మిక సంఘాలు నిరసన తెలుపుతున్నా పట్టించుకోవడంలేదన్నారు. మోదీ విధానాలతో ఇప్పటికే రెండు బ్లాస్ట్ ఫర్నేసుల్లో ఉత్పత్తి నిలిపివేశాయని, పరిశ్రమను నష్టాల బాటలోకి నెట్టేందుకు కేంద్రం కుట్ర పన్నుతుందన్నారు. ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తే ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు ఆదాయం చేకూరుతుందన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
7331100207, 7997958344

గణపతి బప్పా మోరియా

- వాడవాడలా కొలువుదీరిన గణనాథులు
- భక్తిశ్రద్ధలతో పూజలు చేసిన భక్తులు

నక్కపల్లి: గణపతి బప్పా మోరియా.. బోలో గణేష్ మహారాజ్‌కు జై అంటూ వాడవాడలా సందడి నెలకొంది. విఘ్నాలు తొలగించే వినాయక చవితి పండగను శనివారం భక్తజనం ఘనంగా జరుపుకొంది. ప్రత్యేకంగా మండపాలు ఏర్పాటు చేసి వివిధ రూపాల్లో ఉన్న వినాయక ప్రతిమలను ఏర్పాటు చేసి నవరాత్రులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి, దేవవరం, చినదొడ్డిగల్లు, వేంపాడు, ఉద్దండపురం, గొడిచర్ల ఉపమాక, తీనార్ల, నెల్లిపూడగి, డీఎల్ పురం, సీహెచ్ఎల్ పురం, చందనాడ, డొంకాడ, రేబాక, రమణయ్యపేట, వెదుళ్లపాలెం, కాగిత, గుల్లిపాడు తదితర గ్రామాల్లో ఉన్న వరసిద్ధి వినాయక ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం భజన, పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలతో భక్తులు తరించారు. మండపాల్లో వివిధ రూపాల్లో కొలువుదీరిన గణనాథుడిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఈ ఏడాది మండపాల ఏర్పాటు అనుమతి కోసం పోలీస్ శాఖ నిర్ణయించిన సింగిల్ విండో విధానంతో నిర్వాహకులు ఇబ్బంది పడ్డారు. అనుమతి కోసం చలానా రూపంలో వసూలుపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తమైంది.



వెదుళ్లపాలెంలో కొలువుదీరిన గణనాథుడిని దర్శించుకుంటున్న భక్తులు



జగన్నాథపురంలో వినాయక ప్రతిమ ఊరేగింపు

మునగపాక: మండల వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మునగపాక బైపాస్ రోడ్డులో నిర్మించిన వినాయక ఆలయాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ప్రారంభించి, పూజలు చేశారు. అలాగే వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వినాయక చవితి పూజలు జరిపారు. మునగపాక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలోని కృష్ణంరాజు కాలువలో పలువురు భక్తులు గణనాథుడి ప్రతిమలను నిమజ్జనం చేశారు. వాడ్రాపల్లిలోని గణనాథుడిని సాధన సంస్థ అధ్యక్షులు షేక్ ఇస్మాయిల్ దర్శించుకున్నారు.



వాడ్రాపల్లిలో గణనాథుడిని దర్శించుకుంటున్న సాధన సంస్థ అధ్యక్షుడు ఇస్మాయిల్

3 నెలలు అనంతరం నిమజ్జనం

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండల వ్యాప్తంగా గణనాథుడు కొలువుదీరాడు. గ్రామాల్లో వినాయక ప్రతిమలను ఊరేగింపుగా తీసుకువచ్చి మండపాల్లో ప్రతిష్ఠించారు. జగన్నాథపురంలో విగ్రహాన్ని ఇంటింటికీ తీసుకువెళ్లి భక్తుల పూజల నడుమ ప్రతిష్ఠించారు. కార్తీక మాసం అంటే మూడు నెలల తరువాత ఈ విగ్రహాన్ని నిమజ్జనం చేయడం ఆనవాయితీ.



మునగపాక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పూజలు చేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

రాంబిల్లి(యలమంచిలి): మండలంలో అన్ని గ్రామాల్లో గణనాథుడు కొలువుదీరాడు. వినాయక ప్రతిమలను ట్రాక్టర్లు, టాటా మేజిక్ వాహనాల మీద ఊరేగింపుగా బాణసంచా కాల్పుల మధ్య మండపాల వద్దకు తీసుకొచ్చారు. వేద మంత్రాల మధ్య పూజలు చేసి, ప్రతిష్ఠించారు.

ఎస్.రాయవరం: మండలంలో గణపతి నవరాత్రుళ్లు ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామాల్లో గణపతి యూత్ సభ్యులు మండపాలు ఏర్పాటు చేసి గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు.

కోటవురట్ల: వినాయక చవితిని మండలంలో భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. వాడవాడలా వివిధ రూపాల్లో కొలువుదీరిన గణనాథుడిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. పలు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన మండపాలు ఆకట్టుకుంటున్నాయి.



యలమంచిలి కొత్తపేటలో కొలువుదీరిన 13 అడుగుల అయోధ్య వినాయకుడు

యలమంచిలి రూరల్: యలమంచిలి పట్టణం, మండలంలోని గ్రామాల్లో వినాయక నవరాత్రి మహోత్సవాలు కొనసాగుతున్నాయి. స్థానిక టిడ్కో గృహ సముదాయంలో ఏర్పాటు చేసిన పార్వతీపుత్రుని ప్రతిమ ఆకట్టుకుంటోంది. ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు ప్రత్యేక మండపాలను దర్శించుకున్నారు. పలు గ్రామాల్లో మండపాల వద్ద కోలాట ప్రదర్శనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడంతో సందడి వాతావరణం నెలకొంది.



కోటవురట్ల సంతబయలు వద్ద గణనాథుడికి పూజలు చేస్తున్న యువకులు



అడ్డురోడ్డు గణపతి మండపంలో పూజలు నిర్వహిస్తున్న యువకులు



యలమంచిలి టిడ్కో గృహ సముదాయం వద్ద గణనాథునికి పూజలు చేస్తున్న స్థానికులు



మునగపాక దళితవాడలో వినాయకుడిని దర్శించుకుంటున్న భక్తులు



మునగపాకలో వినాయక ప్రతిమలను నిమజ్జనం చేస్తున్న భక్తులు



కోటవురట్ల: సీతారామరాజు నగర్‌లో ఆకట్టుకుంటున్న గణేశుని మండపం

భక్తులతో పోటెత్తిన ఒడ్డిమెట్ట

నక్కపల్లి: భక్తులతో ఒడ్డిమెట్ట కైలాసగిరిపై ఉన్న లక్ష్మీగణపతి ఆలయం పోటెత్తింది. శనివారం చవితి సందర్భంగా ఉదయం నుంచి స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. నక్కపల్లి మండల ప్రజలతో పాటు, అడ్డురోడ్డు, పాయకరావుపేట, యలమంచిలి, తుని, నర్సీపట్నం తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఒడ్డిమెట్ట గణపయ్యను దర్శించుకునేందుకు బారులు తీరారు. ఉచిత దర్శనంతో పాటు, ప్రత్యేక ప్రవేశ దర్శనాలు కూడా కల్పించారు. సాయంత్రం పెద్ద తిరునాళ్లు నిర్వహించారు. భక్తులకు దేవస్థానం, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. గణనాథుడిని వైఎస్సార్ సీపీ నాయకుడు వీసం రామకృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి గెడ్డం బుజ్జి, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్, మాజీ ఎంపీపీ దేవర సత్యనారాయణ, దేవస్థానం మాజీ చైర్మన్ దండు బలరామరాజు, వైఎస్సార్‌సీపీ పబ్లిక్ వింగ్ అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, తదితరులు దర్శించుకున్నారు. పలువురు భక్తులు స్వామివారికి 10 కిలోల లడ్డూలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. ఈ లడ్డూలను వేలం నిర్వహించి భక్తులకు అందజేశారు. నక్కపల్లి సీఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు, ఈవో కిరణ్మయి భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేశారు. గ్రామానికి చెందిన యువకులు కూడా భక్తులకు సేవలు అందించారు.



వినాయకుడిని దర్శించుకుంటున్న వీసం రామకృష్ణ, తదితరులు



మెట్ల మార్గం వరకు క్యూలో వేచి ఉన్న భక్తులు



కోటవురట్ల: సీతారామరాజునగర్‌లో బాల వినాయకునికి పూజలు చేస్తున్న భక్తులు



ట్రాక్టర్‌పై వినాయకుడిని ఊరేగిస్తున్న భక్తులు



మునగపాకలో గణేష్ ఆలయాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

ఎడతెరిపి లేకుండా వర్షం

- స్తంభించిన జన జీవనం
- రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయం



కోటవురట్ల మెయిన్‌రోడ్డులో నిలిచిపోయిన వర్షపు నీరు

కోటవురట్ల: ఆకాశానికి చిల్లుపడిందా అన్నట్టుగా వాన దంచికొడుతోంది. రెండు రోజులుగా అడపదడపా వర్షం కురుస్తుండగా ఆదివారం తెల్లవారు జాము నుంచి ఎడతెరిపిలేకుండా పడింది. జన జీవనం స్తంభించింది. బయటకు వచ్చే అవకాశం లేక జనాలు ఇళ్లకే పరిమితమయ్యారు. లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. పంట కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. వరి పొలాల్లో భారీగా వర్షపు నీరు నిలిచిపోయింది. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట మెయిన్ రోడ్డు వరద నీటితో చెరువును తలపిస్తోంది. చాలా కాలంగా ఎండిపోయిన దుగ్గాడ కాలువ, తుపాకుల గెడ్డలోకి వర్షపు నీరు చేరింది.

మునగపాక: బలహీనంగా ఉన్న గణపర్తి శారదానది గట్టును ఆదివారం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పరిశీలించారు. తాత్కాలికంగా రూ.2 లక్షల నిధులు వెచ్చించి ఇసుక బస్తాలతో పటిష్టతకు చర్యలు తీసుకున్నారు. భవిష్యత్‌లో గట్టు పటిష్టవంతంగా ఉండేందుకు అవసరమయ్యే నిధులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ముంపు సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులను ఆయన ఆదేశించారు.

మునగపాక: మండల వ్యాప్తంగా రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. మునగపాక బీసీ కాలనీలో పలు రోడ్లు జలమయమయ్యాయి. మండల సముదాయానికి వెళ్లే రోడ్డులో వర్షపు నీరు నిలిచిపోయింది. మండల వ్యాప్తంగా 42.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ వినయ్‌కుమార్ తెలిపారు. అలాగే 50 ఎకరాల మేర పంట పొలాలు ముంపునకు గురైనట్లు వ్యవసాయాధికారులు గుర్తించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.



గణపర్తి శారదా నది గట్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

వరద ప్రాంతాల్లో పర్యటన

రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లి మండలం కొత్తూరు, గోకివాడ, రజాల గ్రామాల్లో ఎమ్మెల్యే విజయ్‌కుమార్, అధికారులు ఆదివారం పర్యటించారు. శారదా నది పరివాహక ప్రాంతంలో వరి పంట పొలాలను పరిశీలించారు. భారీ వర్షాలకు దెబ్బతిన్న పంట కాలువల గట్లు, ముంపునకు గురైన ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. శారదా నది నుంచి ప్రవహించే పంట కాలువల గట్లు పటిష్టపరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నీట మునిగిన వరి పొలాలు

పాయకరావుపేట: తాండవ నది ఉధృతితో సాగు నీటి కాలువలు పొంగి పొర్లాయి. పంట పొలాల్లో చేరిన నీరు బయటకు పోవడానికి వీల్లేని పరిస్థితి ఏర్పడింది. మండలంలోని గుంటపల్లి, మంగవరం, గోపాలపట్నం గ్రామాల్లో వరి పొలాలు ఆవ నీటికి మునిగిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎస్.రాయవరం: మండలంలో అడ్డురోడ్డు, సైతారుపేట, సర్వసిద్ధి, పి.ధర్మవరం, పెనుగొల్లు రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోయి చెరువుల్లా దర్శనమిస్తున్నాయి. ఆగకుండా కురుస్తున్న వర్షాలతో గ్రామాల్లో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు.



మునగపాక అయ్యప్పస్వామి ఆలయ సమీప కృష్ణంరాజు కాలువలో ప్రవహిస్తున్న నీరు



ఆవ నీటి ముంపునకు గురైన వరి పొలాలు



సైతారుపేట రోడ్డుపై వర్షపునీరు

యలమంచిలిలో 9.3 సెంటీమీటర్ల వర్షం

యలమంచిలి రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో యలమంచిలి పట్టణం, మండలంలో రెండ్రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకూ ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో జన జీవనం స్తంభించిపోయింది. యలమంచిలిలో శనివారం ఉదయం నుంచి ఆదివారం సాయంత్రం వరకు సుమారు 9.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం కూడా భారీ వర్షాలు పడతాయన్న వాతావరణశాఖ అధికారుల సూచనలతో జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ సోమవారం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ఆదివారం తెరిపివ్వకుండా కురిసిన వర్షానికి యలమంచిలి పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన అల్లూరి సీతారామరాజు కాలనీ, ఎర్రవరం, అత్తిలివారి చేను, రాంనగర్, అలాగే మండలంలో ముంపు ప్రాంతాలైన రామారాయుడుపాలెం, తురంగలపాలెం, జంపపాలెం, ఏటికొప్పాక, కొత్తపాలెం, సోమలింగపాలెం, చినకలవలాపల్లి, తదితర గ్రామాలను మున్సిపల్, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. పరిస్థితిని బట్టి ఆయా గ్రామాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి గ్రామస్థాయి యంత్రాంగం సిద్ధంగా ఉండాలని తహసీల్దార్ రాణీ అమ్మాజీ సూచించారు. శారదా, వరహా నదుల్లో నీటి ప్రవాహ ఉధృతిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నట్టు అధికారులు తెలిపారు. వర్ష ప్రభావంతో నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారి నిర్మానుష్యంగా కనిపించింది. చిరు వ్యాపారులు కూడా ఇళ్లకే పరిమితమయ్యారు. వరి పొలాల్లో వర్షపు నీరు చేరడంతో పంట దెబ్బతింటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.



యలమంచిలి రైల్వేస్టేషన్ రోడ్డులో కురుస్తున్న వర్షం

రుద్రరాజు సేవలు మరువలేనివి

అచ్యుతాపురం(మునగపాక): నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడిన దివంగత మాజీ ఎమ్మెల్యే రుద్రరాజు సత్యనారాయణరాజు సేవలు మరువలేనివని సీపీఎం నాయకుడు కె.రామ సదాశివరావు అన్నారు. అచ్యుతాపురంలో శనివారం సీపీఎం సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే రుద్రరాజు సత్యనారాయణరాజు సంతాప కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణరాజు చిత్రపటానికి వద్ద పలువురు పూలమాల వేసి అంజిలి ఘటించారు. అనంతరం సదాశివరావు మాట్లాడుతూ సత్యనారాయణరాజు దళితులు, రైతుల భూసమస్యలపై సుదీర్ఘ పోరాటాలు చేశారన్నారు. సీపీఎం మండల కన్వీనర్ రొంగలి రాము, బుద్ధ రంగారావు, శరగడం కన్నుంనాయుడు, బాబూరావు, రామునాయుడు, రామ్‌కుమార్, సోమునాయుడు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ప్రమాదకరంగా వంతెనలు

కోటవురట్ల: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పలు వంతెనలు ప్రమాదకరంగా మారాయి. ఇప్పటికే రామచంద్రపురం వంతెన పూర్తిగా శిథిలమై ఓ పక్కకు కుంగిపోయింది. ఏ క్షణంలో అయినా పూర్తిగా కూలిపోయే పరిస్థితి నెలకొంది. శనివారం రాత్రి వంతెన మరింతగా కుంగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ రమణయ్య, ఆర్అండ్‌బీ అధికారులు వంతెనను ఆదివారం పరిశీలించారు. తాత్కాలికంగా భారీ వాహనాల రాకపోకలను నిలిపివేస్తూ అడ్డుగా స్టాపర్స్‌ను ఏర్పాటు చేశారు. ద్విచక్ర వాహనదారులు జాగ్రత్తగా వెళ్లాలని సూచించారు. పక్కనే కొత్త వంతెన నిర్మాణం చేపట్టకపోతే అడ్డురోడ్డుకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోనున్నాయి.

- జల్లూరు వంతెనదీ అదే పరిస్థితి. వంతెనపై పెద్ద గోతులు పడ్డాయి. ప్రస్తుత వర్షాలకు నిండిపోయి వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. పక్కనే వంతెన నిర్మాణం పూర్తయినప్పటికీ అప్రోచ్ రోడ్డు వేయకపోవడంతో ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. వరాహ నదిలోకి భారీగా వరద నీరు వస్తే శిథిల వంతెన పూర్తిగా కూలిపోయే పరిస్థితి ఉంది. దీంతో వాహనచోదకులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు.



రామచంద్రపురం జంక్షన్‌లోని వంతెనను పరిశీలిస్తున్న అధికారులు

14 నుంచి పరమేశ్వరీ వైభవం ప్రవచనాలు

అనకాపల్లి: స్థానిక మెయిన్ రోడ్డులోని కన్యకాపరమేశ్వరి ప్రతిష్ఠ శత జయంత్యుత్సవాల్లో భాగంగా ఈ నెల 14, 15, 16 తేదీల్లో పరమేశ్వరీ వైభవం ప్రవచనాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు అమ్మవారి దేవస్థానం ఆవరణలో సమన్వయ సరస్వతి, వాగ్దేవి వరపుత్ర ప్రవచన విరించి సద్గురు సామవేదం షణ్ముఖశర్మతో ప్రవచనాలు జరుగుతాయన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాయకరావుపేట డివిజన్:
9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com